# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. కార్గిల్ విజయ్ దివస్ రోజు సైనికుల ధైర్యాన్ని గుర్తు చేసుకుందామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.**

**3. ఆయుష్ విభాగంలో 358 పోస్టుల భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

**4. త్వరలో 3 వేల విద్యుత్ బస్సులను ఆర్టీసిలో ప్రవేశపెట్టనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

**5. "మన్ కీ బాత్" 124 వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది.**

==========================

కార్గిల్ విజయ్ దివస్ రోజు మన సైనికుల ధైర్యాన్ని గుర్తు చేసుకుందామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గడ్డకట్టే శిఖరాలపై వారి విజయం ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుందని సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించారు. సైనికుల ధైర్యానికి వందనం చేస్తూ వారసత్వాన్ని గౌరవిస్తున్నాని తెలిపారు.

-------------------------

వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమం, వసతుల కల్పన, ఆరోగ్యం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా గరాయకొండ బాలుర వసతి గృహంలో ప్రమాదవశాత్తు గాయపడి ఒంగోలులోని ప్రభుత్వ సర్వ జన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఎస్. ఆంజనేయులు, గిద్దలూరు కళాశాల బాలుర వసతి గృహంలో పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థి శివకుమార్ ను శనివారం ఈ ఉదయం మంత్రి పరామర్శించారు. విధ్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్... 32 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఆయుష్ విభాగంలో 358 పోస్టుల భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ పోస్టుల్లో 71 మంది వైద్యులు, 26 జిల్లాలకు ప్రోగ్రాం మేనేజర్లు, సహాయకులతో పాటు 90 మంది పంచకర్మ నిపుణులతో కలిపి 358 మంది నియామకాలకు ఆమోదం తెలిపినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుష్ సేవల విస్తరణ కోసం సత్వరమే నియామకాలు చేపట్టాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. 2024-25 సంవత్సరానికి కేంద్రం ఆమోదించిన రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు.

--------------------------

ప్రయాణీకుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణకు త్వరలో 3 వేల విద్యుత్ బస్సులను ఆర్టీసిలో ప్రవేశపెట్టనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులు, కార్మిక సంఘాల నేతలతో నిన్న నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు రాత్రి భత్యాన్ని త్వరలో రూ.130రుపాయిలకు పెంచుతామని వెల్లడించారు.

--------------------------

ప్రపంచ మడ అడవుల దినోత్సవం ఈ రోజు. మాంగ్రూవ్స్ గా పిలిచే ఈ మడ అడవుల విశిష్టతను గుంటూరు డివిజన్ అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఎస్.శ్రీధర్ వివరిస్తూ.. హుదుద్, సునామీ వంటి వైపరీత్యాలనుండి తీర ప్రాంతాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. భూ ఉపరితలంపై కార్బన్ డై ఆక్సైడ్ ను తగ్గించటంలోను మడ అడవులు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ..

వాయిస్... 30 సెకన్లు

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

తెలంగాణలోని యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్ర ఇంటిలిజెన్స్ విభాగానికి చెందిన డీఎస్పీలు చక్రధర్, శాంతారావు మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా డీఎస్పీలు నిన్న రాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా వారి వాహనం ఢివైడర్ ను ఢీ కొని బోల్తా పడగా, అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అదనపు ఎస్పి ప్రసాద్, డ్రైవర్ నర్సింగరావు తీవ్ర గాయాలపాలవడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం దురదృష్టకరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రులు నారా లోకేశ్, కె.అచ్చెన్నాయుడు, ఎం.రాంప్రసాద్ రెడ్డిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

--------------------------

విజయవాడలో మావోయిస్టు దంపతులు డిజిపి హరీష్ గుప్తా ఎదుట ఈ రోజు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కృష్ణా జిల్లా పొరంకి చెందిన సీనియర్ మావోయిస్టు బస్తర్ డివిజన్ కమిటీ ఇన్చార్జి జోరిగె నాగరాజు, అతని భార్య డివిజన్ కమిటీ సభ్యురాలు, కృష్ణా జిల్లా, గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి

చెందిన అరుణ ఉన్నారు. లొంగిపోయిన దంపతులకు తక్షణ ఉపశమనంగా ఒక్కొక్కరికి రూ.20 వేల రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ మధ్య కాలంలో లొంగిపోయిన మావోయిస్ట్ భగత్ సహా 13 మంది యుజి కేడర్ కు చెందినవారికి 22 లక్షల రూపాయల చెక్కులను డిజిపి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. నాగరాజుపై రాష్ట్రంలో 20 లక్షలు, అరుణపై 5 లక్షల రూపాయల రివార్డు ఉందని పేర్కొంటూ..

వాయిస్... 30 సెకన్లు

---------------------------

గోదావరికి ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతున్నందున రాష్ట్రంలోని గోదావరి పరివాహక, లంక గ్రామాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. భద్రాచలం వద్ద ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 32.2 అడుగులుగా నమోదైందని ఒక ప్రకటనలో పేర్కొంది. ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 3.60 లక్షల క్యూసెక్కులుగా ఉందని తెలిపింది.

---------------------------

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి.. వాయవ్య బంగాళాఖాతం వైపుగా కదులుతూ నిన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..30 సెకన్లు

======================